క్లుప్తంగా

మద్యం మత్తులో ఆస్పత్రిపై యువకుల దాడి

● డీజేపై ఫిర్యాదు చేశారన్న కోపంతో వీరంగం



పరకాల: పరకాల పట్టణంలోని సంతోష్ నర్సింగ్ హోంపై కొందరు యువకులు శుక్రవారం రాత్రి మద్యం మత్తులో దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ముదిరాజ్ కాలనీలో శుక్రవారం పెళ్లి జరిగింది. డీజేతో పెళ్లి బరాత్ నిర్వహిస్తూ ఆస్పత్రి సమీపం నుంచి ముందుకు వెళ్లకుండా చాలాసేపు అక్కడే ఉండడంతో రోగుల బంధువులు డయల్ 100కు ఫోన్ చేశారు. అయితే ఆస్పత్రి యాజమాన్యం ద్వారానే పోలీసులకు ఫిర్యాదు వెళ్లిందన్న కోపంతో మద్యం మత్తులో ఉన్న యువకులు ఆస్పత్రిపై దాడి చేశారు. ఆస్పత్రి నడుపకుండా చేస్తామని, ఆస్పత్రి వైద్యుడి అంతు చూస్తామని వీరంగం సృష్టించారు. దాడితో ఒక్కసారిగా ఆస్పత్రిలోని సిబ్బంది, రోగుల బంధువులు భయాందోళనకు గురయ్యారు. ఆస్పత్రిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆస్పత్రి యజమాని డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తెలిపారు. వాస్తవానికి డీజే కారణంగా ఎమర్జెన్సీలో ఉన్న రోగులు ఇబ్బంది పడిన మాట నిజమే అయినా పోలీసులకు తాము ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, కావాలనే కొందరు యువకులు దాడి చేశారని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో అతివేగంగా టిప్పర్ నడిపి అరటిపండ్లు అమ్ముతున్న మహిళ బయ్య శాంతమ్మను గాయపరిచిన బిహార్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ దీపక్‌యాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్వర్ శుక్రవారం తెలిపారు. బాధితురాలి కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా దయాకర్ నియామకం

కమలాపూర్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ ట్రేడర్స్ కోటాలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ పదవికి మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన చకిలం దయాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ శనివారం నియామకపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఝున్సీరాణి, వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్, డైరెక్టర్లు కృష్ణ, విజేందర్, శివకృష్ణ, శ్రీనివాస్, కృష్ణమూర్తి, లింగయ్య, నాయకులు రమేశ్ గౌడ్, చరణ్‌పటేల్, డాక్టర్ కుమారస్వామి, రమేశ్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, మనీష్, భిక్షపతి, మహేందర్, శోభన్ పాల్గొన్నారు.

గట్టు మల్లన్న హుండీ లెక్కింపు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టుమల్లికార్జునస్వామి హుండీని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, దేవాదాయ ధర్మదాయ డివిజన్ పరిశీలకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. మూడు నెలల హుండీ ఆదాయం రూ.43,436, టికెట్ల విక్రయం ద్వారా రూ.1,71,495 కాగా మొత్తం రూ.2,14,931 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు మహేష్ శర్మ, సిబ్బంది సాంబరాజు, సాయిమల్లు, నరేష్ పాల్గొన్నారు.

భూమిపూజ చేసిన కడియం

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల రేణుకాఎల్లమ్మ దేవాలయం నిర్మాణానికి శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరు కలిసి పనులు త్వరితగతిన చేపట్టి ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని సూచించారు. గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా సునీతారాణి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ఇన్‌చార్జ్ ఎంఈఓగా సునీతారాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వర్తించిన ఎంఈఓ వెంకటేశ్వర్లు ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. కాగా ఆయన స్థానంలో కొత్తకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎమ్ సునీతారాణికి ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. పలువురు ఉపాధ్యాయులు ఆమెకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు

దామెర : మండల వ్యాప్తంగా వార్డులవారిగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 132 వార్డులను గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రా గుర్తింపుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈనెల 11వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత గ్రామపంచాయతీల్లో తెలుపాలని సూచించారు.

రైతులకు దూరంగా పీఏసీఎస్ సేవలు

- మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా ఏర్పాటుకాని సొసైటీ
- పాత మండలం ధర్మసాగర్ నుంచే సేవలు
- వేలేరులో ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్
- త్వరలో ముగియనున్న చైర్మన్, డైరెక్టర్ల పదవీకాలం



ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

వేలేరు : రైతులకు పీఏసీఎస్ సేవలు దూరభారం అవుతున్నాయి. మండలం ఏర్పడి ఏనిమిదేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ మండల కేంద్రంలో సొసైటీ ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఉన్న పీఏసీఎస్ నుంచి రైతులు సేవలు పొందుతున్నారు. కానీ వేలేరు మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో రైతులు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఎరువులు, ఇతర అవసరాల కోసం దళారులను ఆశ్రయిస్తున్నారు. 2016లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలు, మండలాలు, గ్రామాల విభజన చేపట్టింది. దీంతో ధర్మసాగర్ మండలం నుంచి 12 గ్రామ పంచాయతీలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి నుంచి కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను కలుపుకుని 14 గ్రామ పంచాయతీలతో వేలేరును మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో మొత్తం 8,592 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వీరిలో ధర్మసాగర్ సొసైటీ పరిధిలో వేలేరు మండల రైతులు సుమారు 2,259 మంది ఉండగా.. ఇటీవల ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో మరికొంత మంది రైతులు కూడా చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు లెక్కలు వేశారు. మండలం నుంచి కేవలం 784 మంది రైతులు సుమారు రూ. 6 కోట్ల పైచిలుకు రుణాలు పొందినట్లు భావిస్తున్నారు. అదే వేలేరు మండల కేంద్రంలోనే ప్రాథమిక సహకార సంఘం, మార్కెట్ కమిటీని ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని, ఎరువులు, రుణాలకు అంతదూరం వెళ్లాల్సిన అవసరం ఉండదని రైతులు భావిస్తున్నారు. పంటను విక్రయించేందుకు అనుకూలంగా ఉంటుందని అంటున్నారు. త్వరలో చైర్మన్, డైరెక్టర్ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దూరం వెళ్లాల్సి వస్తోంది..



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలు ధర్మసాగర్ మండలంలో ఉండటంతో రుణాలు, ఎరువులు, వివిధ పనుల కోసం సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేలేరు మండలంలో ఏర్పాటు చేయాలి.

- జుర్రు సంపత్, రైతు, వేలేరు

పీఏసీఎస్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో పీఏసీఎస్ సొసైటీని ఏర్పాటు చేస్తే మండల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతులకు ధాన్యం విక్రయాలతో పాటు ఎరువుల కొనుగోలుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో మండల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు

- మాచర్ల కనుకరాజు, పీఏసీఎస్ డైరెక్టర్

ఎమ్మెల్యే శంకర్‌పై చర్య తీసుకోవాలి

● వెలమసంఘం నాయకుల ఫిర్యాదు



కమలాపూర్ : పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కమలాపూర్ : వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెలమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక స్థానిక ఎస్సై వీరభద్రరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అసభ్యకరంగా మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. ఎమ్మెల్యే వాడిన భాష వెలమ సామాజిక వర్గ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, అహంకారపూరితంగా ఒక సామాజికవర్గాన్ని దూషించడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం అతడిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, కన్నూరు గ్రామ వెలమ సంఘం అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాసరావు, వర్థినేని రవీందర్‌రావు, పుల్లూరి ప్రభాకర్‌రావు, శ్రీధర్ రావు, సంపత్‌రావు, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

● ప్రిన్సిపాల్ అనిత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత

కమలాపూర్ : ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళలు, ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శనివారం ఆడపిల్లల రక్షణ, వారి భవిష్యత్ కోసం చేపట్టాల్సిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల హక్కులు, అవసరాలు, వాటిని పొందలేకపోవడంపై కారణాలేమిటి, ఆడపిల్లల కోసం పని చేసే, సహకారం అందించే సంస్థల గురించి వివరించారు. అనంతరం 'ఆడపిల్లల భవిష్యత్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితులు' అనే అంశంపై విద్యార్థినులకు వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ క్లస్టర్ కో ఆర్డినేటర్ బోగి శ్రీలత, ఉపాధ్యాయులు వీరేశం, విక్రమ్, తిరుపతి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు



వేలేరు : మాట్లాడుతున్న తహసీల్దార్ కోమి



ఎల్కతుర్తి : క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు

వేలేరు : క్రీడల్లో గెలుపోటములు సహజమని తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల అన్నారు. శనివారం మండలంలోని టీజీఆర్‌జేసీలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. ప్రభుత్వం గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని అన్నారు. వేలేరు విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి మండలానికి పేరు తీసుకురావాలని కోరారు.

ఐనవోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించినట్లు ఎంఈఓ పులి శనివారం ఆనందం తెలిపారు. శని, ఆదివారాల్లో గ్రామస్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ విభాగంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో అండర్ 14, వాలీబాల్ విభాగంలో అండర్ 18, ఖోఖో, కబడ్డీ, యోగ, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో ఓపెన్‌గా ఎంపికలు జరుగుతాయన్నారు. గ్రామస్థాయి ఎంపికల అనంతరం మండలస్థాయిలో ఈనెల 10 నుంచి 12 వరకు, జిల్లా స్థాయిలో 16 నుంచి 21వ తేదీ వరకు సీఎం కప్ క్రీడా పోటీలు ఉండనున్నట్లు తెలిపారు.

దామెర : మండలంలోని పులుకుర్తిలో సీఎం కప్ క్రీడా పోటీలను పంచాయతీ కార్యదర్శి హర్షం శ్రీనివాస్ శనివారం ప్రారంభించి మాట్లాడుతూ.. సీఎం కప్‌లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడలను వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జమ్మునాయక్, మాజీ సర్పంచ్ సరస్వతివెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్, కారోబార్ ఆనంద్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణ అన్నారు. శనివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల ఆవరణలో సీఎం గ్రామస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. గ్రామస్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్లను ఎంపిక చేసి ఈనెల 10,11వ తేదీల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు మల్లేశం మెమోరియల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శీలం అనిల్‌కుమార్ బహుమతులను అందించారు.

ధర్మసాగర్ : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. క్రీడలతో వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం



కమలాపూర్ : చేనేత కార్మికులకు అన్ని విధాలుగా తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు ఎం.విజయలక్ష్మి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలో చేనేత కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చేయూత పథకం కింద నేతకార్మికులకు కమలాపూర్ సంఘ పరిధిలో 227 మందికి లబ్ధిదారుల వాటాగా రూ.4,193,700కు గాను ప్రభుత్వ వాటా రూ.8,387,400 కలిపి మొత్తం రూ.12,581,100 విడుదల చేసిందన్నారు. ఇటీవల మృతిచెందిన బైరి వెంకటస్వామి కుటుంబానికి నేతన్న బీమా పథకం ద్వారా రూ.5లక్షలు బదిలీ చేశామని, 2024, ఆగస్టు 14 నుంచి 59 ఏళ్ల పైబడిన చేనేత కార్మికులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. మూడేళ్ల చేనేత టెక్నాలజీ డిప్లొమా కోర్సులో మండలానికి చెందిన చేనేత కార్మికుడి కుమారుడు ఒకరు ప్రవేశం పొందారని తెలిపారు. కమలాపూర్ చేనేత సహకార సంఘంలో ఉత్పత్తి చేసిన రూ.25,985,479 విలువచేసే వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి అందుకు సంబంధించి రూ.17,243,936 చెల్లించిందని, చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు వివరించారు. పలువురు కార్మికులను సన్మానించారు.

రైస్‌మిల్లర్‌పై చర్య తీసుకోవాలి



అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తిరుపతి

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామ శివారులో గల లక్ష్మి నరసింహ రైస్ మిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి కోరారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ.. గతంలో రబీ సీజన్‌లో రైతులకు డబ్బులు సరిగా చెల్లించలేదని ఆరోపించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి రైస్ మిల్లుకు తరలించిన 48 గంటలలోపు డబ్బులు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అమలు కావడం లేదన్నారు. ధాన్యం దిగుమతి కోసం రైతులు రోజులు తరబడి ఎదురు చూస్తున్నారని, తరుగు పేరుతో కట్టింగ్ పెడుతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. సీఎంఆర్‌కు ఎగనామనం పెట్టిన మిల్లులకు ధాన్యం ఇవ్వద్దని ఆదేశాలున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు.

కూల్చిన శిలాఫలకాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలి

● మాజీ జెడ్పీటీసీ సరిత



కూల్చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు

వేలేరు : మండలంలోని కేజీబీవీలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.2కోట్ల70 లక్షలతో భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కావాలనే కూల్చివేసిందని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతి రాజు ఆరోపించారు. శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి కేజీబీవీని సందర్శించి తొలగించిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల కేజీబీవీలో జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పాత శిలాఫలకాన్ని తొలగించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని మాత్రమే ఉంచారని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలతోనే కాంట్రాక్టర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని తొలగించాడని ఆరోపించారు. శిలాఫలకాలను తొలగించడం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. అయితే అంతకుముందు బీఆర్‌ఎస్ మహిళా నాయకులు కేజీబీవీ పరిశీలనకు వెళ్లగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ పార్టీ మండల కో ఆర్డినేటర్ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీ జ్యోతి, నాయకులు జాని, వీరయ్య, తిరుపతి, రాజు, శ్రీనివాస్, శ్యామ్, రమేశ్, కల్యాణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ధర్మసాగర్ : నృత్యం చేస్తున్న చిన్నారులు



శాయంపేట : పూజలు చేస్తున్న భక్తులు



పరకాలలో..

ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులో గల నవనాగ క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శనివారం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు గంటా సీతారామారావు రాధాదేవి, ఆలయ చైర్మన్ పవన్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం 08 గంటలకు ప్రారంభించిన పూజలు.. రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. ఉదయం 08 గంటలకు నలుగురు పండితులు అష్టోత్తర కలశాభిషేక సేవ పూజ, 09 గంటలకు లక్ష పుష్పార్చన సేవ, 10 గంటలకు అశ్లేషబలి సేవ, 11 గంటలకు సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం, మధ్యాహ్నం 02 గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు కల్చరల్ ప్రోగ్రాం, సాయంత్రం 6.45 గంటలకు వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని శివమార్కండేయ, వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మార్త రాజ్‌కుమార్ వేదమంత్రోచ్చరణల నడుమ నాగేంద్ర స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సుబ్రహ్మణ్యస్వామి షష్టి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాశ్, భక్తులు పాల్గొన్నారు.

పరకాల : వరంగల్ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకతను సంతరించుకున్న సుబ్రహ్మణ్యస్వామి షష్టి జాతర ఉత్సవాలు పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం 6గంటలకు వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ నివాసం నుంచి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి షష్టి బోనం గ్రామ ప్రదక్షిణముగా బయలుదేరింది. రాత్రి 8గంటలకు బోనం ఆలయం చేరుకోగా.. దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. బోనం పూజ, శోభాయాత్రలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. బోనాన్ని తిలకించేందుకు భక్తులు ప్రధాన కూడళ్లకు చేరుకోగా సందడి నెలకొంది. ఎస్సైలు రమేశ్, శివకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్‌సెంటర్ సిబ్బంది సమయపాలన పాటించరా?



మధ్యాహ్నం మూసిఉన్న నేరుడుపల్లి సబ్‌సెంటర్



ప్రగతిసింగారంలో హాజరు కాని సిబ్బంది

శాయంపేట : మండలంలోని నేరుడుపల్లి గ్రామంలో గల సబ్‌సెంటర్‌లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తెరిచి ఉండాల్సిన సబ్ సెంటర్ మధ్యాహ్నమే తలుపులకు తాళం వేస్తున్నారు. అలాగే ప్రగతిసింగారం గ్రామంలో సిబ్బంది ఎవరూ లేకపోవడం.. ఆశ వర్కర్ మాత్రమే ఉండడం, మైలారం సబ్ సెంటర్‌కు మధ్యాహ్నమే తాళం బిగించడంతో పలు అనారోగ్య సమస్యలతో సబ్‌సెంటర్లకు వచ్చిన స్థానికులు వెనుదిరిగారు. అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

కోడెలు అమ్ముకున్న వ్యక్తిని అరెస్ట్ చేయాలి

ఆత్మకూరు : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయ గోశాల కోడెలను అమ్ముకున్న రాంబాబును అరెస్ట్ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. దేవస్థానం కోడెలను ఓ మతానికి చెందిన వ్యక్తికి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన

దామెర : ప్రజల సంక్షమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతుందని తెలంగాణ సాంస్కృతిక సారధి (టీఎస్‌ఎస్) కళాకారులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు తక్కళ్లపహాడ్, ముస్త్యాపల్లిలో కళాజాత నిర్వహించారు. కళాకారులు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పాటలు పాడుతూ ప్రజలకు చైతన్యం కల్పించారు. టీం లీడర్ కొండ సారంగపాణి, కళాకారులు షేక్ వాజీద్‌హుస్సేన్, డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, మారెపల్లి జాన్, బూడిద సురేందర్, బొంకూరి ప్రభాకర్, గడ్డం కళావతి, అడ్డూరి శ్రీనివాస్, రహీమ, పుట్ట జానకి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రజాపాలన విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఇదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, చిట్టంపల్లి అయిలయ్య, నాయకులు సంతాజీ, రాజేశ్వర్‌రావు, యాదగిరిగౌడ్, వెంకటేష్, రాజు, రవీందర్, అశోక్ ముఖర్జీ, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

అంబులెన్స్ వచ్చేసింది..



శాయంపేట : కొన్నేళ్ల కల నేరవేరింది. మండలానికి అంబులెన్స్ కేటాయిస్తామని సభలు, సమావేశాల్లో మాట ఇచ్చిన ఎమ్మెల్యే ఆ మాటను నేరవేర్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన సీడీఎఫ్ నిధుల నుంచి 30 లక్షల నిధులు కేటాయించడంతో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ అంబులెన్స్‌ను కేటాయించారు. శనివారం అంబులెన్స్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుంది. అంబులెన్స్ డ్రైవర్ టెక్నీషియన్ ఉండేందుకు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణ తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.